Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 343 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily) ఆదివారం, 25 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## వరుస బాంబు బెదిరింపు కాల్స్.. ఉలిక్కిపడ్డ నగరాలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వరుస బాంబు బెదిరింపు కాల్స్‌తో ఇటు విజయవాడ అటు విశాఖ నగరాలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి. పలు ప్రాంతాల్లో బాంబులు పెట్టామంటూ ఆగంతకుల ఫోన్ కాల్స్‌తో బాంబు స్క్వాడ్, పోలీసులు ఉరుకులు పరుగులు తీశారు. ఆయా ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈరోజు (శనివారం) ఉదయం విజయవాడలోని బీసెంట్ రోడ్డులో బాంబు పెట్టామని, ఆ తరువాత రైల్వేస్టేషన్‌కు బాంబు బెదరింపు కాల్స్ వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు నిర్వహించి బాంబు లేదని నిర్ధారించారు. తాజాగా విశాఖ రైల్వేస్టేషన్‌లోనూ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేసింది. విశాఖ ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు కాల్ రావడంతో తనిఖీలు చేశారు. ముంబై నుంచి విశాఖ వచ్చే ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు ఉన్నట్లు ఆగంతకుడి నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్టీటీ చివరి స్టాప్ విశాఖ రైల్వే స్టేషన్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రైలు మొత్తాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ 2 బోగీలో అనుమానిత బ్యాగ్‌ను గుర్తించారు. ఆ బ్యాగ్‌ను కూడా సెర్చ్ చేయగా బట్టలు మాత్రమే కనిపించాయి. దీంతో ఎలాంటి బాంబు లేదని అధికారులు నిర్ధారించారు. ఈ ఆపరేషన్‌లో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, సివిల్ పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ బృందాలు కలిసి ట్రైన్‌ను మొత్తాన్ని పరిశీలించారు. ప్రయాణికుల బ్యాగులను కూడా తనిఖీ చేశారు. చివరకు బాంబు లేదని నిర్ధారణకు వచ్చారు. చాలా రష్‌గా ఉన్న ట్రెయిన్‌లో ఇలాంటి కాల్ రావడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే బ్యాగును మరిచిపోయిన వ్యక్తి యూపీకి చెందిన శ్రీరామ్‌గా గుర్తించారు. అలాగే ఫోన్ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై పోలీసులు దృష్టి సారించారు. కాగా.. విజయవాడలో రెండు చోట్ల బాంబులు పెట్టినట్లు అజ్ఞాత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. తెల్లవారు జామున కంట్రోల్ రూంకు ఫోన్ చేసిన ఓ వ్యక్తి బీసెంట్ రోడ్డులో బాంబు పెట్టినట్లు చెప్పి కట్ చేశాడు. బీసెంట్ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం. వందలాది మంది వ్యాపారాలు, కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో బీసెంట్ రోడ్డులో బాంబు పెట్టామంటూ కాల్ వచ్చిన వెంటనే పోలీసులు అలర్ట్ అయి బాంబ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి నాలుగు బృందాలుగా ఏర్పడి అర కిలో మీటర్ వరకు తనిఖీలు చేశారు. ప్రతీ షాపుతో పాటు తోపుడబండ్లను జల్లెడపట్టారు. ఎక్కడా కూడా బాంబు ఉన్న జాడ కనిపించలేదు. దాదాపు నాలుగు గంటల ఆపరేషన్ తర్వాత బాంబు లేదని, ఎటువంటి భయం లేకుండా అందరూ వ్యాపారాలు చేసుకోవచ్చని పోలీసులు తెలిపారు. దీంతో 11 గంటల తర్వాత బీసెంట్ రోడ్డులో వ్యాపార కార్యక్రమాలు మొదలయ్యాయి. బీసెంట్ రోడ్డులో బాంబు లేదని అంతా ఊపిరిపీల్చుకుంటున్న సమయంలో విజయవాడ రైల్వేస్టేషన్‌లో బాంబు కాల్ కలకలం రేపింది. వెంటనే జీఆర్పీ పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు, విజయవాడ పోలీసులు బృందాలుగా ఏర్పడి రైల్వేస్టేషన్‌లోని పది ప్లాట్‌ఫాంలను బాంబు స్క్వాడ్‌తో అణువణువునా గాలించారు. చివరకు పార్సిల్ ఆఫీస్‌కు వెళ్లి పరిశీలించినప్పటికీ ఎక్కడా బాంబు ఉన్నట్లు ఆనవాళ్లు లేవని పోలీసులు నిర్ధారించారు. ఉద్దేశపూర్వకంగా కాల్స్ చేసినట్లు తెలుస్తోంది. ఈ రెండు కాల్స్ ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు.

## డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్



**ఢిల్లీ:** స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పీ 4 ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు బలంగా సంకల్పించామని తెలిపారు. వికసిత్ భారత్ 2047 సాకారంలో ఏపీ ముందుందని పేర్కొన్నారు. ఇవాళ(శనివారం) ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వృద్ధిరేటు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, రెండో, మూడో శ్రేణి నగరాల అభివృద్ధి వంటి వివిధ అంశాలపై చర్చించారు. నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ బ్లూ ప్రింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు.

**మూడో స్థానానికి భారత ఆర్థిక వ్యవస్థ**

భారతదేశం ఆర్థిక వ్యవస్థ గత పదేళ్లలో 10వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకుందని, త్వరలోనే 3వ స్థానానికి వెళ్తుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ ఇండియా, జీఎస్టీ, స్టార్టప్ ఇండియా, పీఎం గతిశక్తి, జల జీవన్ మిషన్ వంటి జాతీయ సంస్కరణలు అభివృద్ధికి దోహదం చేశాయని వివరించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని ఏపీ ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందని తెలిపారు. వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త వచ్చేలా పాలసీలు తీసుకువచ్చామని, 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్‌ఎంఈ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్‌పార్క్‌ను ప్రవేశపెడుతున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**టెక్నాలజీ అభివృద్ధికి ఏపీ మార్గం**

ఏపీలో టెక్నాలజీ అభివృద్ధి చేపడుతున్న కార్యక్రమాలను కూడా సీఎం చంద్రబాబు సమావేశంలో లేవనెత్తారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, అమరావతి రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖపట్నంలో బయోమెడికల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ద్వారా టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి ఏపీ మార్గం వేస్తోందని అన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నం మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నరెన్సులో గూగుల్ ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ క్రియేట్ చేస్తున్నామని వివరించారు. టాటా ఇన్నోవేషన్ హబ్, ఏఐ ఆధారిత పాలన ద్వారా రాష్ట్రం స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.సర్క్యులర్ ఎకానమీ, అభివృద్ధి వికేంద్రీకరణ, మిషన్ కర్మయోగి వంటి కార్యక్రమాల ద్వారా సమగ్రాభివృద్ధిని ఆంధ్రప్రదేశ్ సాధిస్తోందని తెలిపారు.

**జీడీపీ, పాపులేషన్ మేనేజ్‌మెంట్, టెక్నాలజీపై చర్చ**

ఏపీ అభివృద్ధికి ఉపకరించే మూడు కీలక అంశాలను గురించి సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో ప్రస్తావించారు. పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు, ఉద్యోగ సృష్టి వంటి అంశాలపై దృష్టి సారించి, పీపీపీ ప్రాజెక్టులకు కేంద్రం వయోబిలిటీ గ్యాఫ్ ఫండింగ్‌కు మద్దతుగా ఉండటం ద్వారా జీడీపీ వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రపంచంలోని చాలా దేశాలు జనాభా లేమి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని, తద్వారా అభివృద్ధిపై ప్రభావం పడే అవకాశం ఉందని చెప్పారు. కానీ భారతదేశానికి ఉన్న జనాభా కలిసి వచ్చే అంశమని అన్నారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ ద్వారా దేశంలో వృద్ధుల శాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు, మాతృత్వ సెలవులు పెంపునకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. అదే విధంగా కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, డ్రోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వినియోగంతో పాలనలో వేగం పెంచడమే కాకుండా, పౌర సేవలను విరివిగా అందించవచ్చని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఏపీ ఆదర్శం**

స్వర్ణ ఆంధ్ర విజన్ 2047 ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో జాతీయ అభివృద్ధికి దోహదపడేలా ఆదర్శంగా నిలుస్తుందని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 100 ఏళ్లు పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా...మార్గదర్శకత్వం వహించేలా ఏపీ ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. సంక్షోభ సమయంలో ధైర్యంగా నిలిచారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమాయకులకు ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులు అర్పించారు. సాయుధ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవం తమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధైర్యంగా నాయకత్వం వహించారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు.

**బ్లూ ప్రింట్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు**

నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ బ్లూ ప్రింట్ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న సంస్కరణలను అధ్యయనం చేయాలని, సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రణాళిక ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.

## గత ప్రభుత్వం ఛీత్కారాలను మర్చిపోయారా.. డిప్యూటీ సీఎం పవన్ పేషీ..

**అమరావతి, (రాజధాని వార్తలు):** తెలుగు చిత్ర పరిశ్రమపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయం సంచలన ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా.. తెలుగు సినిమా సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారా అని పవన్ పేషీ ప్రశ్నించింది. గత ప్రభుత్వం సినిమా రంగం వారిని, అగ్ర నటులను ఛీత్కరించిన తీరును గుర్తు చేసింది. ఇకపై ప్రభుత్వంతో వ్యక్తిగత చర్చలు ఉండవని, సినిమా సంఘాల ప్రతినిధులే రావాలని స్పష్టం చేసింది. ఇంకా ఆ ప్రకటనలో ఏముందంటే.. 'కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు.. సినిమా రంగం అభివృద్ధినే చూస్తుంది. ఏపీలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని.. ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే.. తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు. ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారి కూడా మర్యాదపూర్వకంగా కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడమినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం సంఘటితంగా రాలేదు. అందరూ కలసి రావాలి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించినా సానుకూలంగా స్పందించలేదు. తెలుగు సినిమా రంగంలోని అగ్ర నటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఛీత్కరించి.. ఇక్కట్ల పాలు చేసిందో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్స్ అసోసియేషన్‌లాంటి సంఘాలు మరిచిపోయినట్లున్నాయి. రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు, సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకూడదు. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. కక్ష సాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో తహసీల్దార్లను




థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా? ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందినవారి చిత్రం విడుదలైనప్పుడు సైతం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డవారు ఇబ్బందిపడకూడదు అనేదే కూటమి ప్రభుత్వ విధానం. తెలుగు సినిమా రంగంవారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధర పెంచమని కోరడం ఎందుకు.. అందరూ కలసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు. దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా చెప్పారు. అయినా ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. సినిమా రంగానికి పరిశ్రమ హోదా ఇచ్చేందుకు ఆలోచనలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తెలుగు సినిమాకి చెందిన కొందరు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌ను కూడా తగిన విధంగానే స్వీకరించాలని నిర్ణయించుకున్నారు' అని పేర్కొంది.

## నైరుతి రుతుపవనాల ఎంట్రీ.. ఇక వానలే వానలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** నైరుతి రుతుపవనాలకు సంబంధించి ఐఎండీ గుడ్‌న్యూస్ చెప్పింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో కేరళలోకి ప్రవేశిస్తాయి. కానీ జూన్‌లో రావాల్సిన రుతుపవనాలు ముందుగానే కేరళలో ప్రవేశించినట్లు ప్రకటించింది వాతావరణ శాఖ. ఐఎండీ ప్రకారం నైరుతి రుతుపవనాలు ఈరోజు (శనివారం) కేరళలో ప్రవేశించినట్లు వెల్లడించింది. సాధారణ తేదీ కంటే ఎనిమిది రోజుల ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయని పేర్కొంది. దాదాపు 16 ఏళ్ల తర్వాత నైరుతి రుతుపవనాలు ముందుగానే కేరళలో ప్రవేశించాయి. గతంలో 2009వ సంవత్సరం మే 23న ఇలానే ముందుగానే ప్రవేశించినట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఎనిమిది రోజుల ముందుగా నైరుతి రుతుపవనాలు వచ్చేసిన తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో రెండు మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జూన్ రెండో వారంలో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతవారణ శాఖ పేర్కొంది. గడిచిన




ఐదు సంవత్సరాల్లో రుతుపవనాలు మే చివరన, లేదా జూన్ మొదటి వారంలో కేరళకు వచ్చాయి. ముఖ్యంగా 2023లో అయితే వారం రోజులు ఆలస్యంగా జూన్ 8న నైరుతి రుతుపనాలు కేరళ తీరాన్ని తాకాయి. కానీ ఈ ఏడాది మాత్రం ఎనిమిది రోజులు ముందుగానే రుతుపవనాలు కేరళను తాకడంతో ఇక రాష్ట్రంలో కూడా జూన్‌లోనే వర్షాలు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతే కాకుండా ఈసారి ముందే నైరుతి రుతుపవనాల రాకతో అత్యధికంగా వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# టిడిపిని ముందుకు నడిపించగల సమర్ధత లోకేష్ బాబుకే ఉంది

## - టీడీపీతోనే సంక్షేమం సాధ్యం - చంద్రబాబు నాయకత్వంలో పని చెయ్యడం అదృష్టం - కోవూరు, పడుగు పాడు, పోతిరెడ్డిపాళెం గ్రామాలను కోవూరు మున్సిపాలిటీగా మార్పుకు ప్రతిపాదన : జిల్లా మహానాడులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు /కోవూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బాబు రచ్చ గెలిచి ఇంట గెలిచి పార్టీని బలోపేతం చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు శుక్రవారం. కనుపర్తి పాడులోని విపిఆర్ కన్వెన్షన్ నిర్వహించిన నెల్లూరు పార్ల మెంటరీ స్థాయి మహానాడులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ అధికారంలో వున్నా లేకున్నా కార్యకర్తల సంక్షేమం పట్ల లోకేష్ బాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారన్నారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అన్యాయంగ జైల్లో పెట్టినప్పుడు న్యాయం కోసం పోరాడి తండ్రిని జైల్లోంచి విడిపించి తీసుకొచ్చి తన ఘనతను చాటుకున్నారని ఆమె అన్నారు. మంత్రి లోకేష్ని కొనియా డారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం కోసమే నాడు అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించా రన్నారు. అప్పటి పటేల్ పట్వారీ వ్యవస్థలను రద్దు చేసి బహుజన రాజ్యం తెచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. ప్రజలే దేవుళ్ళు సమా జమే దేవాలయం అన్న స్ఫూర్తితో స్థాపించిన తెలుగుదేశం పార్టీతో ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలన మొదలైంది అన్నారు. 83లో నాడు ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని ముందుకు నడపడంలో చంద్రబాబు నాయుడు పాత్ర అమోఘమన్నారు. సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో చేయగల సమర్ధత చంద్రబాబు నాయుడు వుందన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జండా



మోసిన కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. దేశంలోనే 4 వేల రూపాయలు పెన్షన్ అందజేస్తున్నది ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అన్నారు. పెన్షన్ పంపిణికి ప్రభుత్వం ఏటా 2 వేల 700 కోట్లు వెచ్చిస్తుందన్నారు. జూన్ 12 నుంచి మరో లక్ష మంది వితంతువులకు పెన్షన్ ఇవ్వనున్నట్లు ఆమె ప్రకటించారు. 203 నిరు పేదలకు అన్నా క్యాంటీన్ ద్వారా గౌరవప్రదంగా ఆకలి తీరుస్తున్నామన్నారు. త్వరలో ప్రభుత్వం మూడు లక్షల 50 వేల రేషన్ కార్డులు పంపిణీ చేయనుందని ఆమె తెలిపారు. సూపర్ సిక్స్‌తో సహా ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరు



స్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం చాలా సంతోషంగా వుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో కోవూరు నియోజకవర్గంలో 11 సార్లు సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా నిరుపేదలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు ఆమె కృతజ్ఞతలు తెలి పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన తీర్మానాలు ప్రవేశ పెట్టారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వ సహకారాలతో కిసాన్ సెజ్‌లో వ్యవసాయ సంబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ముదివర్తి - ముదివర్తి పాళెం మధ్య పెన్నా నదిపై కాజ్ వే నిర్మాణాన్ని వేగవంతం చేసి ఏడాదిలో పూర్తి చేసేలా ప్రయత్నిస్తానన్నారు. గత వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా కావలి రెవెన్యూ డివిజన్‌లో కలిపిన విడవ లూరు, కొడవలూరు మండలాలను తిరిగి నెల్లూరు రెవెన్యూ డివిజన్లో కలిపేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. కోవూరు, పడుగుపాడు, పోతి రెడ్డి పాళెము గ్రామ పంచాయతీలను విలీనం చేసి కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటుకు కృషితో పాటు మైపాడు, రామతీర్థం బీచ్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించి టూరిజం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రాలలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీ ఆర్ విగ్రహాల ఏర్పాటుతో పాటు ప్రతి మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి కృషి, పెన్నా డెల్టా ఆధునీకరణ, గ్రామీణ ప్రాంతాలలో సోలార్ పవర్ యూనిట్స్ తదితర అంశాలను ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహకులు కార్యదర్శి జి వి ఎన్ శేఖర్ రెడ్డి, వంశీ కృష్ణ రెడ్డి, 5 మండలాలు అధ్యక్షులు బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్దన్ రావు, టీడీపీ విడవలూరు, ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు పెంచలయ్య, కమలకర్ రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, అశోక్ రెడ్డి, నియోజకవర్గం స్థాయి టీడీపీ నేతలు అతిరధ టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు

# వీధి నాటకం ద్వారా హెచ్ఐవి/ ఎయిడ్స్‌పై అవగాహన







**కాకినాడ, (రాజధాని వార్తలు):** చేంజెస్ స్వచ్ఛంద సంస్థ కాకినాడ ఆధ్వర్యంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి/ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తాడేపల్లి గుంటూరు జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటాజీ ఫోర్ హెచ్ఐవి / ఎయిడ్స్ క్లస్టర్ కాకినాడ వారు సంయుక్తంగా మే 13వ తేదీ నుండి 29 వరకు కళా జాతర బృందాలతో వీధి నాటకముల ద్వారా హెచ్ఐవి/ ఎయిడ్స్ మరియు సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమములో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆర్.రమేష్ (డి ఎల్ ఏ టి ఓ) ఆదేశాలతో, కే వి ఆర్. శైలజ (సిపిఎం) మరియు చేంజెస్ కాకినాడ సంస్థ కే.పుష్పా కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ మెయిన్ సెంటర్, రిక్షా స్టాండ్ ప్రాంగణంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ మరియు వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు మరియు సుఖ వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు లేకుండా ఎలాగా సమాజంలో కలిసి జీవించాలి సుఖ వ్యాధులు మరియు క్షయ వ్యాధి సంబంధం గూర్చి వాటి చికిత్స గూర్చి కండోమ్ యొక్క ఉపయోగాలు గూర్చి ఆరోగ్య విషయాల పట్ల కళా జాతర ద్వారా అవగాహన కల్పించారు. పంచాయతీ సెక్రటరీ నల్లబత్తుల శ్రీనివాస్, ఐసిడిఎస్ అధ్యక్షులు టీ.సురేష్ మాట్లాడతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా అనేకమందకి అవగాహనా కలుగుతుందని, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు అనేకం జరగాలి అని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రేక్షకులు మరియు ఆరోగ్య సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, వీఆర్వో సురేష్, ఐసిడిఎస్ అధ్యక్షులు సూరడా సింహాద్రి, ఎంపీటీసీ చొక్కా సింగన్న, కాకినాడ జీజీహేచ్ ఐసీటీసీ కౌన్సిలర్ వినోద్, జీజీహేచ్ డిఎస్ఆర్ సి కౌన్సిలర్ శ్రీనివాస్, ఎం పి హచ్ ఎ విష్ణు, రాజు - ఉప్పాడ, వీర నాగమణి, చేంజెస్ ప్రాజెక్ట్ మేనేజర్ పి.దుర్గ భవానీ, చేంజెస్ కాకినాడ సంస్థ సిబ్బంది శివా, సునీత, నాగ దుర్గ, సరోజ, నారాయుడు, గౌరి, గాయత్రి, సుశీల, మరియు చైతన్య కళాభారతి వెల్ఫేర్ అసోసియేషన్ కళాకారులు ట్రూప్ ఆర్గనైజర్ వీర్నాల కృష్ణ మరియు బృంద సభ్యులు దువ్వూరి శేషు కుమారి గుబ్బల శ్రీనివాసరావు ఎడవల్లి సత్య వర్మ విప్ప గోవిందరాజు ఎడవల్లి రమణబాబు పాల్గొని కళా జాతర బృందం వారు ప్రదర్శన చేసి ఉన్నారు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు అధికారులు కళాకారులని అభినందించినారు.

# కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అభివృధికి పెద్ద పీట : ఎంఎల్ఏ పంతం నానాజీ


## - 7వ దఫా రూ.10 లక్షలు సి ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ





**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అభివృధికి పెద్ద పీట వేస్తూ, గత ప్రభుత్వ పనితీరు వల్ల ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్న కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తుందని కాకినాడ రూరల్ ఎంఎల్ఏ పంతం నానాజీ పేర్కొన్నారు. కాకినాడ గుడారిగుంటలో కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ కార్యాలయం వద్ద రూరల్ నియోజకవర్గం పరిధిలో గల 12 మందికి 9, 69, 049 లక్షల రూపా యలు ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన చెక్కులను కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు పెదపూడి మను, సవితాల రామచంద్ర రావు, తాతపూడి శ్రీనివాస్, రెడ్డి సత్య ప్రసాద్, గొల్లపల్లి సంజయ్ కుమార్, రేలంగి రాజు, మంచినశెట్టి ప్రసన్న కుమార్, రాయుడు శ్రీను, సామాన గౌరమ్మ, తుమ్మలపల్లి సూర్యనారాయణ, ఆచంట రామలక్ష్మి, మెర్నిడి సత్యనారాయణలకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా పంతం నానాజీ మాట్లాడుతూ ఇప్పటివరకు 80 లక్షల 92 వేల రూపాయల విలువ చేసే 66 చెక్కులు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించకుంటే చర్యలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఎమ్మార్పి ధరలకు మద్యం విక్రయాలు జరుపకుంటే చర్యలు తప్పవని పెద్దాపురం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కెవివి దుర్గార్జునరావు హెచ్చరించారు. కాకినాడ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్, డిప్యూటీ కమిషనర్ వారి ఆదేశముల మేరకు మద్యం దుకాణాల వద్ద ఎమ్మార్పి ధరలు ఉల్లంఘన, మద్యం దుకాణాల సమయాల నియంత్రణలో భాగంగా పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మద్యం దుకాణాల వద్ద జిల్లా ఎక్సైజ్ అధికారులు, పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కెవివి దుర్గార్జునరావు, సిబ్బంది పెట్రోలింగ్ కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా మద్యం దుకాణాల వద్ద ఎమ్మార్పి ఉల్లంఘన, టైమింగ్ సమయ పాలన అతిక్రమించినచో కేసులు నమోదు చేయనున్నట్టు మద్యం వ్యాపారులను హెచ్చరించారు.

# అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం హుస్సేన్ గ్రామంలో ఈనెల 26, 27 తేదీల్లో జరగనున్న మదుగులమ్మ అమ్మవారి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పండుగను సాంప్ర దాయ పద్ధతిలో జరుపుకోవాలని సామర్లకోట సీఐ కృష్ణ భగవాన్ అన్నారు. శుక్రవారం హుస్సేన్ పురం గ్రామంలో గ్రామ పెద్దలతో ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణభగవాన్ మాట్లాడుతూ జాతర మహోత్సవంలో అశ్లీల నృత్యాలు, ఎలాంటి గొడవలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేలా చూడాలని పిలుపునిచ్చారు. అలాగే ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు



ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ నాయకులు, గ్రామ నాయకులు, ప్రజలు, యువత పాల్గొన్నారు.

# ఉపాధి శిక్షణలకు దరఖాస్తు చేసుకోండి





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపునాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతి యువకుల నైపుణ్యాలను మెరుగు పరిచే ఉద్దేశ్యంతో పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (నాక్) శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా నైపుణ్య శిక్షణలు అందించి, వారు తీసుకున్న శిక్షణకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ప్రారంభించినట్టు శిక్షణా కేంద్రం ఇంచార్జి ఎన్ తాతారావు తెలిపారు. శుక్రవారం వారు ఒక ప్రకటనలో తెలుపుతూ దీనిలో భాగంగా అర్హులైన అభ్యర్ధుల నుంచి ధరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా సర్వేయింగ్, ప్లంబింగ్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తిగల యువత దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సర్వేయింగ్ కోర్స్ 75 రోజులు ఉంటుందని దీనికి ఐటిఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివిన యువత అర్హులన్నారు. అలాగే 60 రోజుల ప్లంబింగ్ కోర్స్‌నకు పదవ తరగతిలోపు, ఐటిఐ, ఇంటర్ చదివిన యువత అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే యువత వయసు 18 నుంచి 40 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఆసక్తిగల యువత ఈనెల 26వ తేదీనుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని, పూర్తి వివరాలకు సామర్లకోట సిబిఎం హైస్కూల్ ఎదురుగా ప్రత్తిపాడు సెంటర్లో ఉన్న నాక్ శిక్షణా కేంద్రంలో సంప్రదించాలని ఈ సందర్భంగా ఇంచార్జి తాతారావు తెలిపారు.

# అప్పుడు అలా అన్న వాళ్లే ఇప్పుడు మెచ్చుకుంటున్నారు



నేచురల్ స్టార్ నాని హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా మంచి సక్సెస్‌లో ఉన్నాడు. కోర్టు, హిట్3 సినిమాలతో నిర్మాతగా తక్కువ టైమ్‌లో వరుస సక్సెస్‌లు అందుకున్న నాని, ఏం చేసినా దాని గురించి ఎంతో ఆలోచించే అడుగు ముందుకేస్తాడు. ఈ విషయం ఇప్పుడు మరోసారి స్పష్టమైంది. శైలేష్ కొలను దర్శకత్వంలో నాని నటిస్తూ నిర్మించిన హిట్3 సినిమా నార్త్‌లో కేవలం సింగిల్ స్క్రీన్స్‌లో మాత్రమే రిలీజైందనే విషయం తెలిసిందే. ఈ విషయంలో రిలీజ్ టైమ్‌లో నాని కొన్ని విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. అయితే నార్త్‌లో ఏదైనా సినిమాను మల్టీప్లెక్స్‌లో రిలీజ్ చేయాలంటే ఓటీటీ రిలీజ్ కనీసం 50 రోజుల తర్వాతే ఉండాలనేది అక్కడి రూల్. దానికి సదరు నిర్మాత ఒప్పుకుంటేనే మల్టీప్లెక్సుల్లో సినిమాలు ఆడతాయి. లేదంటే ఆడవు. హిట్3 సినిమా విషయంలో నాని ఆ రూల్‌కు నో చెప్పి నెట్‌ఫ్లిక్స్‌తో 28 రోజుల స్ట్రీమింగ్‌కు డీల్ కుదుర్చుకుని, నార్త్‌లో కేవలం సింగిల్ స్క్రీన్ రిలీజ్‌నే ప్లాన్ చేసుకున్నాడు. హిట్3 రిలీజయ్యాక తెలుగు రాష్ట్రాల్లో మిక్స్డ్ టాక్‌తో మొదలై మంచి లాభాలనే తెచ్చిపెట్టింది. కానీ నార్త్‌లో మాత్రం హిట్3 మంచి ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఇప్పుడు మే 29న హిట్3 నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చేస్తుంది. ఇదంతా చూస్తుంటే నాని హిట్3 ఓటీటీ విషయంలో తీసుకున్న డెసిషనే కరెక్ట్ అనిపిస్తుంది. ఎందుకంటే నార్త్ ఆడియన్స్‌కు హిట్3 పెద్దగా ఎక్కలేదు. వారిని నమ్ముకుని మల్టీప్లెక్సుల డీల్ కు ఒప్పుకుని ఉంటే నెట్‌ఫ్లిక్స్ హిట్3 కోసం నానికి ఆఫర్ చేసిన మొత్తం రేటులో భారీ కోత పడేది. దీంతో నాని నష్టపోయేవాడు. అయితే ఇప్పుడు విషయం తెలుసుకున్న అందరూ నానిని ఈ విషయంలో మెచ్చుకుంటున్నారు. ఓ వైపు థియేటర్ రిలీజ్, ఓటీటీ రిలీజ్‌కు గ్యాప్ ఉండాలని నిర్మాతలకు ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్న టైమ్‌లో నాని లాంటి నిర్మాత తీసుకున్న నిర్ణయం వారిలో ఏమైనా మార్పును తీసుకొస్తుందేమో చూడాలి. ఒకటి మాత్రం నిజం, మేకర్స్ మంచి కంటెంట్‌తో అలరించగలిగితేనే ఈ రోజుల్లో ఆడియన్స్ థియేటర్లకు వస్తున్నారు తప్పించి లేదంటే ఎంత స్టార్ క్యాస్టింగ్ ఉన్నా, ఎంత భారీ బడ్జెట్ సినిమా అయినా దాన్ని చూడాలనుకోవడం లేదు మన ప్రేక్షకులు.

# అనగనగా నయా ట్రెండ్‌కు శ్రీకారం చుడుతుందా?



ఇంతకుముందు ఏదైనా సినిమాలు చూడాలంటే థియేటర్లోనే చూడాలి. లేదంటే టీవీ ఛానెల్స్‌లో చూడాలి. కానీ మారుతున్న జెనరేషన్‌లో భాగంగా ఇప్పుడు ఓటీటీలు వచ్చేశాయి. పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు, డాక్యుమెంటరీలు, రియాలిటీ షోలు సైతం ఈ ఓటీటీల్లోనే చూస్తున్నారు ఆడియన్స్. కరోనా ద్వారా ఈ ఓటీటీల వాడకం బాగా పెరిగింది. థియేటర్ రిలీజ్ కు ఇబ్బంది పడే ఎన్నో సినిమాలకు ఓటీటీలు దేవాలయాల్లా కనిపిస్తున్నాయి. అందుకే కోవిడ్ నుంచి చాలా సినిమాలు నేరుగా ఓటీటీలో రిలీజయ్యాయి. అంతేకాదు, థియేటర్ రన్ తర్వాత కూడా కొత్త సినిమాలు ఓటీటీలో రిలీజవుతుండటం చాలా కామన్. కానీ ఇప్పుడు దానికి రివర్స్‌లో ఓటీటీలో రిలీజైన ఓ సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు వెళ్లబోతుంది. రీసెంట్‌గా ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చిన అనగనగా అనే సినిమాకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. విమర్శకులు సైతం ఈ సినిమాను ప్రశంసిస్తున్నారు. కొన్ని ఏరియాల్లో ఫ్రీ ప్రీమియర్లు వేస్తే అవి కూడా హౌస్‌ఫుల్స్ అయ్యాయి. ఈ సినిమా ప్రీమియర్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో త్వరలోనే అనగనగా సినిమాకు పెయిడ్ షోలు వేయనున్నట్టు ఆ సినిమాలో మెయిన్ లీడ్‌గా నటించిన సుమంత్ తెలిపాడు. అయితే ఓటీటీలో రిలీజైన సినిమా ఇలా థియేటర్లలో రిలీజ్ చేయడం ఇదేమీ ఫస్ట్ టైమ్ కాదు. గతంలో కూడా కొన్ని సినిమాలను ఇలానే చేశారు కానీ అవేమీ పెద్దగా క్లిక్ అవలేదు. కానీ అనగనగా మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆ సినిమా ఆకట్టుకునే ఛాన్స్ ఉంది.

లిమిటెడ్ స్క్రీన్స్‌లో రిలీజ్ ప్లాన్ చేస్తున్న అనగ నగా ఓ కొత్త ట్రెండ్‌కు తప్పకుండా నాంది పలుకుతుందని మేకర్స్ కాన్ఫిడంట్‌గా ఉన్నారు. ఒకవేళ మ్యాజిక్ జరిగి థియేటర్లలో కూడా ఈ సినిమా హిట్ అయితే పలువులు దీన్ని ఫాలో అయ్యే ఛాన్సుంది. అలా అని ఏ సినిమాను పడితే ఆ సినిమాను ఓటీటీలో రిలీజ్ అయ్యాక థియేటర్లలోకి తీసుకొచ్చి రిలీజ్ చేస్తే మొదటికే మోసం వచ్చే ఛాన్స్ కూడా ఉంది. అయితే అనగనగా థియేట్రికల్ రిలీజ్ విషయంలో మాత్రం మేకర్స్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.

# చందమామ కాజల్‌తో ఎవరు ఈ అతిథి?




బిజినెస్‌మేన్ గౌతమ్ కిచ్లుని పెళ్లాడిన కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తన వారసుడు జూనియర్ కిచ్లు (నీల్ కిచ్లు) ఆలనా పాలనా చూసుకోవడానికే సమయం సరిపోవడం లేదు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో కాజల్ ప్రతిష్టాత్మక రామాయణం సినిమాలో రావణాసురుడి భార్య మండోదరిగా నటిస్తోంది అంటూ ప్రచారం సాగింది. రణబీర్- నితీష్ కుమార్ మూవీలో నటించనుందని కథనాలొచ్చాయి. అయితే దీనికి అధికారికంగా ఎలాంటి కన్ఫర్మేషన్ లేదు. ప్రస్తుతానికి కాజల్ తన వ్యక్తిగత జీవితంపైనే దృష్టి సారించింది. తాజాగా విమానాశ్రయంలో తన కుమారుడు నీల్‌తో కలిసి వెళుతున్నప్పటి ఒక వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారుతోంది. కార్‌లో ఫోటోగ్రాఫర్లకు హాయ్ చెబుతూ కుమారుడి చెంతనే కాజల్ కనిపించింది. కొంత గ్యాప్ తర్వాత ఇల్లు విడిచి ఇలా విమానాశ్రయంలో ప్రత్యక్షమైన కాజల్ ఫోటోలు తీసేందుకు ఫోటోగ్రాఫర్లు పోటీపడ్డారు. కాజల్ సౌత్- నార్త్ రెండు చోట్లా పాపులర్ హీరోయిన్. కెరీర్ బెస్ట్ ఫేజ్‌లో పెళ్లితో లైఫ్‌లో సెటిలైంది. బెబో కరీనా, కాజోల్, మాధురి దీక్షిత్ తరహాలో కాజల్ అగర్వాల్ రీఎంట్రీ కోసం అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు. కాజల్ తిరిగి రీఎంట్రీ ఇవ్వాలనుకుంటే టాలీవుడ్ గ్రాండ్ వెల్ కం చెబుతుంది. ఇక ప్రభాస్, మహేష్ తర్వాత సింగపూర్ మ్యాడమ్ టుస్సాడ్స్‌లో మైనపు విగ్రహం కలిగి ఉన్న ఏకైక నటి కాజల్ అగర్వాల్ అన్న సంగతి తెలిసిందే. ఈ మైనపు విగ్రహాన్ని తమ అభిమాన తార కాజల్ గౌరవం, హుందాతనం, స్టాటస్‌కి సింబల్‌గా అభిమానులు భావిస్తున్నారు.

# ఆలియా కేన్స్ ఆరంగేట్రం రెస్పాన్స్ ఇదీ



ఇండియా- పాక్ ఉద్రిక్తతల కారణంగా ఆలియా భట్ కేన్స్ 2025 ఆరంగేట్రాన్ని వాయిదా వేసుకుందని ప్రచారం సాగింది. కేన్స్‌లో మొదటి రోజే ఆలియా అడుగుపెట్టాల్సింది... కానీ అది జరగలేదు. దానికి కారణం భారత్ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం.. అంటూ ప్రచారం సాగింది. ఎట్టకేలకు ఆలియా భట్ ఫ్రెంచ్ రివేరా వేదికగా జరుగుతున్న కేన్స్ ఉత్సవాల్లో పాల్గొంది. ఈ వేడుకల్లో ఆలియా ధరించిన ప్రత్యేకమైన డిజైనర్ దుస్తులు అందరి దృష్టిని ఆకర్షించాయి. కేన్స్ రెడ్ కార్పెట్‌పై తొలిసారి ఆరంగేట్రం చేస్తున్న ఆలియా ఆర్గాన్జా ఎనామెల్ ఫ్లోరల్ ఐవరీ రఫ్ఫ్లుతో ఎంబ్రాయిడరీ చేసిన ఆఫ్-షోల్డర్ బస్టియర్ గౌనులో ప్రత్యక్షమైంది. ఈ లుక్ చాలా మందిని ఆకర్షించినా కానీ, 2017 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మల్లికా షెరావత్ మెర్మైడ్ గౌనును ఇమ్మిటేట్ చేసిందని నెటిజనులు గుర్తు చేశాయి. కేన్స్‌లో మల్లిక చాలా సీనియర్. కొన్నేళ్ల పాటు రెడ్ కార్పెట్ లుక్స్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారగలిగింది. 2017లో మల్లిక పింక్ కలర్ అద్దిన, లేత గోధుమరంగు జార్జెస్ హెూబెకా ఆఫ్-షోల్డర్ మెర్మైడ్ గౌనులో ఇండియన్ క్వీన్‌లా కనిపించింది. ఇప్పుడు మళ్లీ ఆలియా లుక్ దానిని గుర్తు చేసిందని నెటిజనులు కామెంట్ చేస్తున్నారు. అయితే ఆలియా ఆరంభ లుక్ అదిరిపోయిందంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ ఆలియా తన మేకప్, హెయిర్ డిజైన్ ఎంపికతో కొంత నిరాశపరిచిందని అభిమానులు భావిస్తున్నారు. ఒక నెటిజన్ వ్యాఖ్యానిస్తూ, ఈ దుస్తులు చాలా అందంగా ఉన్నాయి అని ప్రశంసించారు. ఆలియా నటిస్తున్న స్పై మూవీ ఆల్ఫా విడుదల కావాల్సి ఉంది. ఇందులో శార్వరి కూడా నటిస్తోంది. సంజయ్ లీలా భన్సాలీ లవ్ & వార్‌లోను ఆలియా నటిస్తోంది. ఇందులో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# యోగా మన ప్రాచీన సంస్కృతి : జిల్లా ఆయుష్ శాఖ అధికారి కె.లావణ్య



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** యోగతో ప్రతీ ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ కె లావణ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని "యోగాంధ్ర - 2025" కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో 25 మంది యోగ గురువులు చేత 100 మంది మాస్టర్ ట్రైనీలకు యోగా ప్రోటోకాల్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజులు పాటు జిల్లా మండల గ్రామ స్థాయిలో వివిధ యోగా కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. యోగా మన ప్రాచీన సంస్కృతి, యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుండి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఇప్పుడున్న బిజీ షెడ్యూల్ లో ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. అందువల్ల చిన్న వయసులోనే మధుమేహం, దృష్టి లోపం వస్తున్నాయని, దీని వల్ల మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతోందని పేర్కొన్నారు.

ప్రతీ ఒక్కరూ యోగా చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటారని, అలసట ఉండబోదని ఉద్బోధించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి కె మనోరామ జిల్లా, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె వి జ్యోతి, ఆయుష్ విభాగం వైద్యాధికారులు, యోగా ఇన్స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# జాకెట్లు 84వ వార్డు శానిటరీ సిబ్బందికి జాకెట్లు, నూనె, సబ్బులు పంపిణీ




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** 84వ వార్డు పరిధిలో పనిచేస్తున్న శానిటేషన్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి 16 మంది సిబ్బందికి టౌన్‌లో మరో 1 మంది విలీన గ్రామాల్లో సిబ్బందికి సబ్బులు నూనె 84వ వార్డు ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు చేతుల మీదుగా ఈరోజు ఉదయం శానిటరీ ఇన్స్పెక్టర్ గణేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ చూచుకొండ రమణ శానిటరీ సిబ్బంది గణేష్ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# బీకాం కంప్యూటర్స్ విభాగం విద్యార్థులకు అభినందనలు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్ర విశ్వవిద్యాలయం నిన్న విడుదల చేసిన డిగ్రీ ఫైనల్ ఫలితాలలో స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో బీకాం కంప్యూటర్స్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జే కార్తీక్ మరియు ఆర్ వెంకట లక్ష్మీ ప్రసన్న అత్యధిక గ్రేట్ పాయింట్లు 9.00 సాధించి యూనివర్సిటీ స్థాయిలో ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కళాశాలన్నింటిలోకెల్లా అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఇచ్చే ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ద్వితీయ స్థానం సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు.

కళాశాల యాజమాన్యం నిరంతరం విద్యార్థుల భవిష్యత్తు కొరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్ దయా మాధురి, యు నాగేశ్వరరావు, ఎస్ఎస్ జమీర్ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



# యుటిఎఫ్ సీనియర్ నాయకుడు యండమూరి వేణుగోపాలరావు మృతి

**కాకినాడ, (రాజధాని వార్తలు):** రిటైర్డ్ గాంధీనగర్ హైస్కూల్ ప్రధానోపా ధ్యాయుడు, వై.వేణుగోపాలరావు (70) 23.5.2025 తెల్లవారు ఝామున 2 గంటలకు కాకినాడలో మృతి చెందారు. వారు గత కొద్దీ కాలంగా దీర్ఘ అనారోగ్యంతో బాధపడుతూ ఈరోజు తుదిశ్వాస విడిచారు. వేణు గోపాలరావు మృతికి సంతాపం తెలియజేస్తూ.. కాకినాడ నగర శాఖ యూటీఎఫ్ గౌరవాధ్యక్షులుగా ఉపాధ్యాయులకు విశిష్ట సేవాలాందించడమే కాకుండా ఉచిత హోమియో వైద్యం అందించి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాల ప్రజలకు, ఇతర రాష్ట్రాల ప్రజలకు కూడా ఎనలేని సేవలు అందించారని అన్నారు.

# బియ్యం ఇంటి వద్దకే చేర్చిన ఎం.డి.యు సేవలు నిలిపి వేయకండి

**- మండల డిపో యూనిట్ విధానాన్ని కొనసాగించాలని పాడేరు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి**



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి ఎం.డి.యు (మండల డిపో యూనిట్) ఆధ్వర్యంలో ఇంటింటికీ బియ్యం పంపిణీని నిలిపివేయాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఎం.డి.యు యూనియన్ మండల అధ్యక్షుడు వనము సింహాచలం, ఉపాధ్యక్షుడు యు. పూర్ణ రవిశంకర్ నేతృత్వంలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎం.డి.యు పథకం పేద, బడుగు, బలహీన వర్గాలకు వరంగా మారిందని పేర్కొన్నారు. నేరుగా లబ్ధిదారులకు బియ్యం అందేలా, ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా ఈ విధానం సమర్ధవంతంగా అమలైందన్నారు. ప్రభుత్వం తాత్కాలికంగా ప్రవేశపెట్టిన కొత్త విధానాలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.డి.యు విధానాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ పథకం పేద ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుందని స్పష్టం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల్ని అమలు చేస్తూ, ప్రజలకు మేలు చేసే పథకాలను రద్దు చేయాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.డి.యు యూనియన్ నాయకులు జాన్, నీలకంఠం, సుందర్, సిమోన్, రవి, లావణ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌తో బాధ పడుతున్న చిన్నారికి ఆర్థిక సహాయం

**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** శ్రీకాకుళం జిల్లా, కల్లేపల్లి పంచాయితీ మోఫస్ బందర్ గ్రామంకు చెందిన స్రవంతి (వయస్సు 7 సంవత్సరాలు), పాప Bone Marrow Cancerతో బాధపడుతుంది. ట్రీట్మెంట్‌ను విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్‌లో తీసుకుంటుంది. వీరు రజక వృత్తిదారులు మరియు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎటువంటి ఆదాయ వనరులు లేవు. ఈ అమ్మాయికు Bone Transplant Surgery చేయాలి. ఇందుకు గాను సుమారు ఇరవై అయిదు లక్షలు ఖర్చు అవుతుంది అని డాక్టరు చెప్పారు. సిఎం రిలీఫ్ ఫండ్‌కి అప్లై చేసారు 10 లక్షలు శాంక్షన్ అయ్యింది కానీ మిగతా డబ్బు కోసం దాతల సహాయం కోరుతున్నారు. విషయం తెలిసిన వెంటనే మన సంస్థ సభ్యులు ఎంక్వయిరీ చేయగా నిజం అని తెలిసింది. ఈరోజు పాప వైద్యం కోసం మన సంస్థ తరపున మెరైన్ పోలీస్ ఎస్ఐ మహాలక్ష్మి చేతుల మీదుగా 20,000/– ఆర్థిక సహాయం చేయడమైనది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అవినాష్, జగదీష్, చంద్రశేఖర్, ఎస్సై మహాలక్ష్మి, వెంకట్రావు, నరసింహ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

**- బదిలీల్లో అదనపు పాయింట్లు కేటాయించాలి : నోబుల్ టీచర్స్ అసోసియేషన్**

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** గత ప్రభుత్వం తీసుకు వచ్చిన అసంబద్ధ 117 జీవోతో ఊహించని విధంగా మారుమూల గిరిజన ప్రాం తాలకు బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు బదిలీల్లో అదనపు పాయింట్లు కేటాయించి న్యాయం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీను బాబు బాబు కోరారు. ఈ మేరకు అనకాపల్లిలో శనివారం వారొక ప్రకటన విధులు చేశారు. 2023 లో జరిగిన బదిలీల్లో వీరంతా ఊహించని విధంగా ఇటువంటి సదుపాయాలు లేని మారు మూల గిరిజన ప్రాంతాలకు బదిలీ అయ్యారన్నారు. ఇందులో 50 ఏళ్లకు పైబడి వయస్సు కలిగిన మహిళలు, భార్యాభర్తల ఉద్యోగుల్లో ఒకరు ఉన్నారన్నారు. అలాగే అనారోగ్యాల బారిన పడిన వారు కూడా ఉన్నారు. వీరికి న్యాయం చేస్తామని ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి పలు పర్యాయాల హామీ ఇచ్చారన్నారు. త్వరలో జరగనున్న బదిలీల్లో వీరికి అదనపు పాయింట్ల కేటాయిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా ప్రకటించారన్నారు. అయితే అధికారులు మాత్రం అదనపు పాయింట్లు వచ్చే బదిలీలకు వర్తిస్తుందని చెప్పడం సరికాదన్నారు.

ఆయన ఈ బదిలీలకే ఆ నిర్ణయం వస్తుందని ప్రకటించినందున గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయు లకు న్యాయం చేయాలని వారు కోరారు. లేని పక్షంలో సమస్యను మరలా ప్రభుత్వం, విద్యా శాఖామంత్రి దృష్టికి తీసుకు వెళతా మన్నారు. అలాగే గిరిజన ప్రాంత గ్రామాలన్నింటికీ కేటగిరి 4 గానే ప్రకటించాలన్నారు. అధికారులు వీరికి న్యాయం చేయడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan